హరహర మహాదేవ

కార్తీకమాసం తొలి సోమవారం పురస్కరించుకుని జిల్లాలో శివాలయాలన్నీ కిటకిటలాడాయి. శివనామంతో మార్మోగాయి. వేకువజామున కార్తీక పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు అనంతరం శివుడి దర్శనానికి బారులుతీరారు. దీపారాధనలు, ప్రసాదాలు, అభిషేకాలతో ఆలయాలన్నీ ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. ఆలయాల పరిసరాల్లో ఉన్న కోనేరులు కార్తీక దీపాలతో కనువిందు చేశాయి.



విజయనగరం ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం

6లో

నాయకుల విగ్రహాలకు ముసుగు



విజయనగరంలో ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల విగ్రహాలకు ముసుగు తొడిగారు. కోడ్ కారణంగా సోమవారం ప్రజల నుంచి వినతుల స్వీకరణ కూడా చేపట్టలేదు. దీంతో కలెక్టరేట్ ప్రాంతం బోసిపోతూ కనిపించింది.

6లో



వినతుల స్వీకరణ నిలిపేయడంతో బోసిపోతున్న కలెక్టరేట్ లోపలిభాగం

తాగునీరెంత సురక్షితం?

- గుర్ల ఘటనతో బయటపడ్డ ఆర్‌డబ్ల్యూఎస్ డొల్లతనం
- పూసపాటిరేగ మండలంలోనూ డయేరియా కేసులు
- జిల్లాలో పక్కపక్కనే మురుగు, మంచి నీటి పైపులైన్లు
- ఐదేళ్లపాటు గాలిదొదిలేసిన స్వచ్ఛాంధ్ర నినాదం
- పంచాయతీలకు నిధులివ్వని గత వైసీపీ ప్రభుత్వం

● శృంగవరపుకోట పంచాయతీ శివారు సీతంపేట గ్రామంలోని మురుగు కాలువ ఇది. స్థానికుల తాగునీటి సరఫరాకు దీన్లోనుంచే పైపులైను ఏర్పాటు చేశారు. పైపులు లీకున్న చోట మురుగునీరు కలుస్తుంది. ఆ నీటినే స్థానికులు తాగుతున్నారు.





శృంగవరపుకోట పంచాయతీ శివారు సీతంపేట మురుగుకాలువలో తాగునీటి పైప్‌లైన్

జిల్లాలో చాలా గ్రామాల్లో సరఫరా చేస్తున్న తాగునీరు సురక్షితంగా లేదన్నది బహిరంగ రహస్యం. మురుగునీటి కాలువల పక్క నుంచి, లోపలి నుంచి పైపులైన్లు ఉంటున్నాయి. లీకులు ఏర్పడినా చాలా రోజుల పాటు వాటికి మరమ్మతులు చేయని ఘటనలు కోకొల్లలు. బయటకు కనిపించని లీకులకు లెక్కేలేదు. పట్టణాల పరిస్థితులూ ఇందుకు భిన్నంగా లేవు. పక్కపక్కనే మురుగు కాలువ, తాగునీటి పైపులైన్లు ఉన్నాయి. ఇటీవల డయేరియాతో వార్తలకెక్కిన గుర్లలోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తాజాగా పూసపాటిరేగ మండలంలో నమోదైన డయేరియా కేసుల వెనుకా ఇదే కారణం ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

శృంగవరపుకోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):

డయేరియా కేసులతో వారం రోజుల పాటు రాష్ట్రస్థాయిలో గుర్ల గ్రామం వార్తల్లో నడిచింది. నాలుగు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానిదే తప్పున్న విధంగా అంతకముందు ఐదేళ్లు పాలించిన ప్రస్తుత ప్రతిపక్ష వైసీపీ విమర్శల వాన కురిపించింది. జిల్లాకు చెందిన నాయకులతోపాటు ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ కూడా గుర్లలో పర్యటించారు. అంతకు ముందే ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. మరోవైపు వ్యాధిని అదుపులోకి తెచ్చేందుకు జిల్లా యంత్రాంగం తీవ్రంగా శ్రమించింది. కారణాలను అధ్యయనం చేసేందుకు ర్యాపిడ్ రెస్పాన్స్ టీంను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కాగా గుర్లతో పాటు డయేరియా బాధిత గ్రామాల నుంచి సేకరించిన 44 నమూనాల్లో 31 నమూనాల్లో కోలిఫామ్ ఉన్నట్లు కమిటీ గుర్తించింది. తాగునీటిలో కలిసిన మురుగులో ఈ-కోలై బ్యాక్టీరియా ఉన్నట్లు, 57 మలం నమూనాల పరీక్షల ఆధారంగా భూగర్భజలాలు కలుషితమైనట్లు, సెప్టిక్ ట్యాంకుల లీకేజీలు కూడా దీనికి కారణంగా పేర్కొంటూ నివేదికలు అందించింది. దీన్ని బట్టి తాగునీరెంత సురక్షితమో అర్థం చేసుకోవచ్చు.

పంచాయతీలకు నిధులివ్వని వైసీపీ ప్రభుత్వం..

గుర్ల ఘటనతో గ్రామీణ తాగునీటి సరఫరా డొల్లతనం బయటపడింది. పంచాయతీ, తాగునీటి సరఫరా, వైద్య ఆరోగ్య శాఖల మధ్య సమన్వయం తేటతెల్లమైంది. ఇదంతా గత వైసీపీ పాలకుల నిర్వాకమే. నాటి ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసింది. 14వ ఆర్థిక సంఘ నిధులను సర్పంచ్‌లకు, కార్యదర్శులకు తెలియనీయకుండా విద్యుత్ బిల్లుల కోసమంటూ వెనక్కి లాగేసింది. నిధులను పక్కదారి పట్టించడంతో పంచాయతీల్లో కనీస వసతులను కల్పించలేకపోయారు. పంచాయతీ ఖాతాల్లో నిధులు లేక పారిశుధ్య నిర్వహణ అటకెక్కింది. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ కూడా చేయలేకపోయారు. పారిశుధ్య నిర్వహణ, క్లోరినేషన్, తాగునీటి సరఫరా పైపుల మార్పు వంటి వాటికి అవసరమైన నిధులు ఖాతాల్లో లేక పంచాయతీ (మిగతా 8వ పేజీలో...)

స్వచ్ఛాంధ్రప్రదేశ్ ఎక్కడ?

స్వచ్ఛాంధ్రప్రదేశ్, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను పూర్తిగా గాలికి వదిలేశారు. దీంతో గ్రామాలకు ఆనుకుని బహిరంగ మలవిసర్జన పెరిగింది. ఒక పక్క పారిశుధ్య నిర్వహణ లేకపోవడం, మరో పక్క బహిరంగ మలవిసర్జనతో మలినాలన్నీ వర్షాకాలంలో పడిన నీటితో పాటు భూగర్భంలోను, తాగునీటి వనరుల్లోనూ కలిసాయి. ఇటీవల తుఫాన్ల ప్రభావంతో వర్షాలు పడినప్పుడు భూగర్భ జలాలు పెరిగాయి. కలుషితమై వున్న భూగర్భజలాలను తాగుతుండడంతో జిల్లాలో అక్కడికక్కడ డయేరియా కేసులు బయటపడుతున్నాయనేది వైద్యాధికారుల ప్రాథమిక అంచనా.



ఎరుకొండలో అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

ఎరుకొండను సందర్శించిన కలెక్టర్

- డయేరియా కేసులపై ఆరా

పూసపాటిరేగ, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): ఎరుకొండను కలెక్టర్ అంబేడ్కర్ సోమవారం సందర్శించి గ్రామంలో డయేరియా విస్తరణకు కారణాలపై ఆరా తీశారు. నివారణ చర్యలపై అధికారులకు సూచనలిచ్చారు. ముందుగా పూసపాటిరేగ ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. అనంతరం ఎరుకొండ గ్రామానికి వెళ్లి స్థానిక పరిసరాలను పరిశీలించారు. మంచినీటి పైపులైన్‌లు డ్రైనేజీ కాలువ లోపలి నుంచి ఉన్న కారణంగా తాగునీరు కలుషితమై డయేరియా ప్రబలే అవకాశం ఉందని వైద్యాధికారులు ఆయనకు వివరించారు. అయితే నాలుగురోజులుగా వేరే ప్రాంతం నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా పూర్తి నియంత్రణలోకి రాకపోవడంపై కలెక్టర్ ప్రశ్నించారు. గ్రామంలో కొనసాగిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. గ్రామాన్ని ఆర్‌డీవో దాట్ల కీర్తి కూడా సందర్శించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. మురుగు నీరు అధికంగా పేరుకుపోవడాన్ని గుర్తించి సిబ్బందికి సూచనలిచ్చారు. కాగా అధికారిక సమాచారం ప్రకారం ఇప్పటి వరకు గ్రామంలో సుమారు 30మందికి పైగా డయేరియ బారిన పడ్డారు. ఇంకా 11మంది వరకూ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు.

ప్రశాంత ఎన్నికకు సహకరించాలి

- ప్రవర్తన నియమావళి పాటించాలి
- జిల్లాలో 727 మంది ఓటర్లు
- విజయనగరం, పార్వతీపురంలో రెండు పోలింగ్ కేంద్రాలు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహించడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ అంబేడ్కర్ కోరారు. ఎన్నిక నిర్వహణపై సోమవారం తన చాంబర్‌లో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. అందరూ ఎన్నికల నియమావళిని పాటించాలని సూచించారు. ముసాయిదా ఓటర్ల జాబితాను నవంబరు 2న ప్రచురించామని, మొత్తం 727 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. పార్వతీపురంలో 325 మంది ఉండగా ఇందులో పురుషులు 132, మహిళలు 193 ఉన్నట్లు తెలిపారు. విజయనగరం జిల్లాలో మొత్తం ఓటర్లు 402 మంది కాగా వారిలో 239 మంది మహిళా ఓటర్లు, 163మంది పురుష ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఓటర్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను రాజకీయ పార్టీలు 8వ తేదీలోగా తెలియజేయాలన్నారు. వాటిని పరిశీలించి నవంబరు 10న తుది జాబితా ప్రచురిస్తామన్నారు. ఎన్నిక నిర్వహణకు నోటిఫికేషన్ కూడా విడుదలైందని, ప్రతి రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటలు వరకూ జేసీ నామినేషన్లు స్వీకరిస్తారని, 12న నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. 14న మధ్యాహ్నం మూడు గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. పార్వతీపురం, విజయనగరం ఆర్‌డీవో కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నవంబరు 28న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందని, ఓట్ల లెక్కింపు డిసెంబరు 1న ఉదయం 8 గంటల నుంచి జరుగుతుందన్నారు. ఈ ఉపఎన్నిక నిర్వహణకు జేసీ సేతు మాధవన్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారని, విజయనగరం, పార్వతీపురం డీఆర్‌వోలు ఏఆర్‌వోలుగా వ్యవహరిస్తారని తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, డీఎస్‌పీ శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కోడ్‌ను కచ్చితంగా అమలు చేయాలి

ఎన్నికల ప్రవర్తనా నియామావళిని ఖచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఆయన సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి మండలానికీ ఒక ఎంసీసీ బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, నాయకులు నిర్వహించే సమావేశాల్లో అధికారులు పాల్గొనకూడదన్నారు.

నేడు నాగుల చవితి



విజయనగరం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): దీపావళి అనంతరం కార్తీక శుద్ధ చతుర్థి రోజున వచ్చే నాగుల చవితిని జిల్లా ప్రజలు ఏటా ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ ఏడాది కూడా సన్నద్ధమయ్యారు. హిందూ సాంప్రదాయంలో నాగుల చవితికి ఎంతో విశిష్టత ఉంది. నగేంద్రునికి ప్రత్యేక ప్రసాదాలు నివేదిస్తారు. పాలు, గుడ్లు వేస్తారు. పెద్దలు, పిల్లలు కలిసి పూజలు చేస్తారు. కుటుంబాల సమేతంగా పుట్టకు వెళ్తారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా నాగుల చవితిని గ్రామీణ ప్రాంతాల్లో మరింత వైభవంగా నిర్వహిస్తారు. వేకువజామునే నిద్రలేచి నువ్వులతో ప్రసాదాన్ని సిద్ధం చేసి, పాలుతో పాటు ఇతర పూజాసామగ్రితో పుట్ట వద్దకు వెళ్తారు. దీపావళి మాదిరిగానే పుట్ట వద్ద కూడా దీపాలు వెలిగించి స్వల్పంగా బాణసంచా కాల్చుతారు. కాగా పుట్టలు నగర, పట్టణ ప్రాంతాల్లో కరువయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో అంత వెతుక్కునే పరిస్థితి లేకపోయినా పట్టణాల్లో రియల్ ఎస్టేట్ సంస్కృతి వల్ల పుట్టలు దొరకడం కాస్త కష్టంగా మారింది.

నాణ్యత ప్రమాణాలతో ధాన్యం సేకరణ

- 3.40 లక్షల టన్నులు సేకరణ లక్ష్యం ● ఈనెల మూడోవారం నుంచి ప్రక్రియ
- ఎక్కువ ధర లభిస్తే రైతు ఎక్కడైనా విక్రయించవచ్చు
- ధాన్యం సేకరణ సిబ్బంది శిక్షణలో జేసీ సేతుమాధవన్


7లో

భారత ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని రైతుల నుంచి సేకరిస్తామని జేసీ సేతుమాధవన్ తెలిపారు. ధాన్యం సేకరణకు సంబంధించి సిబ్బందికి సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణలో మాట్లాడారు. మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తే రైతులు ఎక్కడైనా విక్రయించుకోవచ్చునన్నారు.



హామీ ఇచ్చి.. విస్మరించి

- దీవెనల నిధులు ఇవ్వని నాటి వైసీపీ సర్కారు
- ఫీజుల కోసం ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాల ఒత్తిడి
- అప్పులు చేసి చెల్లిస్తున్న తల్లిదండ్రులు
- మంత్రి లోకేశ్ ప్రకటనపై ఆశలు



● రాజాం పట్టణానికి చెందిన శ్రీనివాస్ ఓ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్నాడు. ఇటీవల ఆయన తండ్రి కృష్ణకు కాలేజీ నుంచి సమాచారం వచ్చింది. మీ కుమారుని ట్యూషన్ ఫీజుతో పాటు హాస్టల్ ఫీజు కట్టాలని వారు కోరారు. అయితే ప్రభుత్వమే ఇస్తుంది కదా? అంటే ప్రభుత్వం ఇచ్చిన తరువాత తీసుకుందురు. ముందు ఫీజు కట్టండి అని హుకుం జారీచేయడంతో కృష్ణ అప్పుచేసి ఆ మొత్తాన్ని కట్టాడు.

రాజాం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వసతిదీవెన, విద్యాదీవెన పథకాల కింద విద్యార్థులకు రూ.352 కోట్ల బకాయిలు ఉన్నట్టు సమాచారం. ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ, ఇతర వృత్తిపరమైన కోర్సులు చదువుకున్న వారికి వందశాతం ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తుందని అప్పట్లో సీఎం జగన్ ప్రకటించారు. అమలుచేయడంలో విఫలమయ్యారు. అది పేద విద్యార్థులకు శాపంగా మారింది. తల్లిదండ్రులకు ఇప్పుడు ఆర్థిక భారంగా తయారైంది. కళాశాలల యాజమాన్యాల నుంచి ఒత్తిడి పెరుగుతుండడంతో ప్రస్తుతం వారంతా అప్పులు చేసి ఫీజులు కడుతున్నారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఫిర్యాదులు వస్తుండడంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. జగన్ ప్రవేశపెట్టిన దీవెనల స్థానంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ రీయింబర్స్‌మెంట్ పథకాలను పునరుద్ధరించారు. పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు చేపట్టారు.

మాట మార్చిన జగన్..

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఫీజుల కోసం విద్యాదీవెన, హాస్టల్ కోసం వసతిదీవెన ప్రవేశపెట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు అయినా పర్వాలేదు వర్తింపజేస్తామని ప్రకటించారు. దీంతో చాలామంది ప్రభుత్వమే భరిస్తుందని భావించి ప్రైవేటు కాలేజీల్లో చేర్పించారు. ఉమ్మడి జిల్లాలో 2,356 మంది రెండు దీవెనల కింద చదువుకున్నట్టు తెలుస్తోంది. ఇందులో రెగ్యులర్ పీజీలు చేసిన వారికి ఏడాదికి రూ.4.71 కోట్లు, విద్యాదీవెన కింద రూ.5 కోట్లు చెల్లించాల్సి ఉంది. అంటే ఏడాదికి రూ.9.71 కోట్లు చొప్పున రూ.47.25 కోట్ల వరకూ బకాయిలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

మూడేళ్లుగా పెండింగ్..

ఏడాదికి నాలుగు విడతల్లో విద్యాదీవెన ఫీజు కట్టాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, ముస్లిం, క్రైస్తవ విద్యార్థులకు ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ కోర్సుల్లో 75 శాతం హాజరు, కాలేజీ..కోర్సు ఆధారంగా (మిగతా 8వ పేజీలో..)



శివోహం

- సందడిగా కార్తీక సోమవారం
- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- వేకువజాము నుంచే బారులు

విజయనగరం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస తొలి సోమవారం.. ఉమ్మడి జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామున 3 గంటల నుంచే శివాలయాల్లో పూజలు ప్రారంభమయ్యాయి. రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, విశేషమైన పూజలు చేశారు. విజయనగరంలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం, మూడు కోవెళ్ల, వీరరాజేశ్వర స్వామి ఆలయం, కొత్త అగ్రహారంలోని కాశీవిశ్వేశ్వర స్వామి, కొత్తపేటలో విమర్శ ప్రకాశ విశ్వేశ్వర స్వామి తదితర ఆలయాల్లో వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

పశుపతినాథునికి ప్రత్యేక పూజలు..

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా రింగురోడ్డు ఎస్‌వీఎన్ నగర్‌లో పశుపతినాథేశ్వర స్వామి ఆలయంలో స్ఫటిక లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయంలో క్షీరాభిషేకం చేశారు. ఆలయ అర్చకులు సంతోష్‌కుమార్ శర్మ, సోమయాజులు, సుబ్రహ్మణ్యంల సామూహిక రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం వృషభ వాహన సేవను నిర్వహించారు. కార్యక్రమంలో శారదా సేవా సంఘ అధ్యక్షులు చెరుకూరి శ్రీధర్, కార్యదర్శి గుడిసా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పశుపతినాథునికి అభిషేకం చేస్తున్న అర్చకుడు





విజయనగరంలో రుద్రాక్షలతో శివలింగం

శివాలయాలు కిటకిట

గరుగుబిల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలోని మొదటి సోమవారం శివాలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తులు నదీ స్నానాలు ఆచరించి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మొదటి వారం భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి.



గిజబ శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం ముందు బారులు తీరిన భక్తులు



పంచముఖేశ్వరుని దర్శనానికి క్యూలో బారులు తీరిన భక్తులు

భారీగా తరలివచ్చిన భక్తులు

సాలూరు రూరల్/సాలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లాలో శివాలయాలు వేకువ జాము నుంచే భక్తులతో రద్దీగా కనిపించాయి. శివదర్శనానికి భక్తులు వేకువ నుంచే క్యూ కట్టారు. సాలూరులోని వేగావతిలో నదీ స్నానం చేసి వేకువ నుంచి పంచముఖేశ్వర స్వామిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దీపారాధన చేశారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నాగేశ్వర స్వామి, వేంకటేశ్వర కాలనీ ఉమా రామలింగేశ్వర స్వామి, వెలమపేటలో కాశీవిశ్వేశ్వరుడు, కామాక్షి ఆలయంలో ఏకామ్రనాథ్‌లకు ప్రత్యేక అభిషేకాలను చేశారు. సాలూరు మండలం గుమ్మలకొండ గుహలో శివుని, పాచిపెంట మండలం మంచాడవలస గుహలో ఉన్న గోకర్లేశ్వర స్వామిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కొట్టక్కి భీమలింగేశ్వర స్వామికి పెద్దసంఖ్యలో భక్తులు పూజలు చేశారు.



సాలూరులో పంచముఖేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు



అలజంగిలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ ఆలయంలో..

అలజంగిలో పూజలు..

బొబ్బిలి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అలజంగి గ్రామంలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ ఆలయంలో సోమవారం వేకువజాము నుంచి భక్తులు బారులు తీరారు. గ్రామ శివారు వేగావతి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులు స్వామితో పాటు గోమాతను దర్శించు కుని పూజలు చేశారు.

పుణ్యగిరిలో...

శృంగవరపుకోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోటలోని పుణ్యగిరి శ్రీఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కార్తీక మాస పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారు జాము నుంచే స్వామి దర్శనానికి క్యూ కట్టారు. శ్రీదారగంగమ్మ లోయ, పుట్టధార ఘట్టాల వద్ద స్నానాలు చేశారు.



పుణ్యగిరి శ్రీ ఉమా కోటి లింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల పూజలు

ఆకట్టుకున్న సంచార శివలింగం

శృంగవరపుకోట రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భర్తపురం శ్రీకల్యాణవైబోగప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ఏర్పాటు చేసిన సంచార శివలింగం ఆకట్టుకుంది. దీనిని బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసి... భక్తులకు శివతత్వాన్ని వివరించారు. జామి త్రిపురాంతక స్వామి ఆలయంలోనూ పూజలు చేశారు.



బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన సంచార శివలింగం

భక్తిశ్రద్ధలతో పూజలు

బొబ్బిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసంలో మొదటి సోమవారం శివాలయాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేకువ జామున 3 గంటల నుంచే భక్తులు క్యూలైన్‌లలో బారులుదీరారు. స్థానిక దిబ్బవీధి శివాలయం, జంగాల, మల్లమ్మపేట శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళా భక్తులు రావి, ఉసిరి, జమ్మి, మారేడు తదితర చెట్లు, నంది విగ్రహాల ముందు పెద్దఎత్తున దీపాలు వెలిగించారు. వివిధ సంస్థలు అన్నదానాలు ఏర్పాటు చేశాయి.



ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు




కొత్తవలస: శివాలయంలో లింగానికి అలంకరణ



గ్రంథాలయంలో చదువుతున్న పాఠకులు

దురిబిలిలో చదువుల వెలుగులు

- స్థానికంగా గ్రంథాలయం ఏర్పాటు
- దాతల సాయంతో పుస్తకాల సేకరణ
- పోటీ పరీక్షలకు యువత సన్నద్ధం



దురిబిలి గ్రామం

కురుపాం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దురిబిలి ఓ గిరిజన గ్రామం. అత్యంత వెనుకబడిన సవర తెగకు చెందిన వారి నివాసం. ఆ గ్రామస్తుల కృషి, పట్టుదల, ఐకమత్యం చెప్పుకోదగ్గవి. మండల కేంద్రమైన కురుపాంకు 6 కిలోమీటర్ల దూరంలో గల ఈ గ్రామంలో 72 ఇళ్లు ఉన్నాయి. అక్కడి ప్రజలు పోడు వ్యవసాయం, కూలీ నాలీ చేసుకుని బతుకుతున్నారు. కానీ విద్యకు గ్రామస్తులు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. 72 ఇళ్లు ఉన్న ఈ గ్రామంలో 80 మంది విద్యాధికులు ఉన్నారు. వీరిలో దాదాపు 50 మంది ప్రస్తుతం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. బయటి పట్టణాలకు వెళ్లి కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందే స్తోమత వీరికి లేదు. సామాజిక సేవా కార్యకర్త షేక్ గౌస్ సాహెబ్...దాతల సాయంతో దురిబిలిలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. యువత శ్రమదానంతో స్థానిక సామాజిక భవనాన్ని గ్రంథాలయంగా మార్చుకున్నారు. విశాఖపట్నానికి చెందిన మోసెస్ స్వచ్ఛంద సంస్థ రూ.50 వేల విలువ గల పుస్తకాలను విరాళంగా ఇచ్చింది. పుస్తకాలు భద్రపరుచుకోవడానికి రూ.40 వేల విలువైన 4 బీరువాలను అందించింది. విశాఖపట్నానికి చెందిన మాజీ నేవీ ఉద్యోగులు షేక్ సిరాజుద్దీన్, నగేష్, గంగాధర్‌లు రూ.30 వేల విలువైన పుస్తకాలను సమకూర్చారు. వీటితో గిరిజన యువకులు పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. గ్రంథాలయ ఇన్‌చార్జిగా స్థానిక యువకుడు తోయిక కాంతారావు వ్యవహరిస్తున్నారు. మోసెస్ సంస్థ సహకారంతో గుమ్మలక్ష్మీపురం మండలంలోని కొత్తవలస, జియ్యమ్మవలస మండలంలోని టి.కె.జమ్ము గ్రామాల్లో నూతనంగా గ్రంథాలయాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు గౌస్ సాహెబ్ తెలిపారు. ఇదిలా ఉండగా...ఇప్పటికే దురిబిలి గ్రామానికి చెందిన కొంతమంది యువకులు వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడి...మిగిలిన వారికి స్ఫూర్తిదాయంగా నిలుస్తున్నారు.

సహకరిస్తున్నాం..



గ్రామ పంచాయతీ తరఫున గ్రంథాలయానికి సహకారం అందిస్తు న్నాను. ఇప్పటికే ఫ్యాన్లు, లైట్లు సమకూర్చాం. రెండు దినపత్రికలు అందిస్తున్నాం. లైబ్రరీలో రాత్రి వేళల్లో వయోజనులకు విద్యనందిస్తున్నాం.

-పువ్వల అజ్జారి, సర్పంచ్

ఒక్కరు ఉద్యోగం పొందినా చాలు..



దాతలను ఒప్పించి లైబ్రరీ ఏర్పాటుకు కృషి చేశాను. గ్రామానికి చెందిన ఒక్కరు ఉద్యోగం పొందినా చాలు అని దాతలు అన్నారు. యువత పట్టుదల చూస్తుంటే పోటీ పరీక్షలలో అధిక సంఖ్యలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది.

-షేక్ గౌష్ సాహెబ్

వార్తలు వినిపిస్తున్నాను..



ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు పత్రికల్లోని వార్తలను లైబ్రరీలో చదివి వినిపిస్తున్నాను. దీంతో యువతకు కరెంట్ అఫైర్స్ తెలుస్తున్నాయి. గ్రామస్తులు, పిల్లలు సైతం హాజరవుతున్నారు. పిల్లలు హోమ్ వర్క్‌ను లైబ్రరీలో చేసుకుంటున్నారు.

-పువ్వల పత్తి, మాజీ సర్పంచ్

షటిల్ కాక్ కాదు..



ఈ చిత్రంలో కనిపిస్తున్నది అచ్చం షటిల్ కాక్‌లా ఉంది కదూ. కానీ షటిల్ కాక్ కాదు. ఇది పుట్ట గొడుగు. పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం చినమేరంగి గ్రామ దళితవాడకు ఆనుకొని శ్మశాన స్థలం ఉంది. అక్కడే ఇది కనిపించింది. అచ్చం షటిల్ కాక్‌లా కనిపించే ఈ పుట్ట గొడుగును సోమవారం ఉదయం జనం ఆసక్తిగా తిలకించారు.

-జియ్యమ్మవలస, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి)

కోడ్ కూసింది.. ముసుగు పడింది!

విజయనగరం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఎన్నికల ప్రవర్తనా నియామ వళిని అనుసరించి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, ఇతర ప్రచార పోస్టర్లను తొలగించారు. రాజకీయ నాయకుల విగ్రహాలను మూసేశారు. ఎన్నికల నియామావళిపై అధికారులు ఇప్పటికే విస్తృత ప్రచారం నిర్వహించారు. జిల్లాలో అధికారిక కార్యక్రమాలు నిర్వహించడం లేదు. జిల్లా వ్యాప్తంగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిలిచిపోయాయి. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశపెట్టిన దీపం పథకం-2 కూడా నిలిచి పోయింది. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే కోడ్ అమలులో ఉంటుంది.



ఎత్తుబ్రిడ్జి వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహానికి ముసుగువేసిన దృశ్యం



వైఎస్సార్ విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం



కోట వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి...

జిల్లాలో సెక్షన్ 30 అమలు

- ఎస్పీ మాధవరెడ్డి



బెలగాం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సెక్షన్-30 అమలులో ఉంటుందని ఎస్పీ మాధవరెడ్డి సోమవారం తెలిపారు. ఎన్నికల కమిషన్ నియమాలను కచ్చితంగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనుమతి లేనిదే ఎవరూ సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. నగదు, మద్యం అక్రమ రవాణా అరికట్టి ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజాప్ర తినిధులు నిర్వహించే సమావేశాలకు హాజరు కావద్దని, ప్రచారానికి వినియోగించే లౌడ్ స్పీకర్లకు అనుమతి తీసుకోవాలని తెలిపారు.

ఎన్నికల నియమావళి అమలు చేయాలి

- ఎస్పీ వకుల్‌జిందాల్



విజయనగరం క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిందని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని ఎస్పీ వకుల్‌జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో చేపట్టాల్సిన చర్యలపై జూమ్ కాన్ఫరెన్స్‌లో పోలీసులకు సోమవారం దిశను నిర్దేశించారు. ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల న్నారు. కోడ్ అమల్లో ఉన్నందున ప్రజాప్రతినిధులు నిర్వహించే సమావేశాలకు హాజరుకావద్దని చెప్పారు. ఎన్నికల సమావేశాలు, ర్యాలీలకు ప్రచారానికి వినియోగించే లౌడు స్పీకర్లకు సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను పంచాయతీ, మున్సిపాలిటీ, నగరపాలక సంస్థ అధికారుల సహకారంతో తొలగించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

శృంగవరపుకోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖకు చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. శృంగవరపుకోట సీఐ వీఎస్ మూర్తి కథనం మేరకు.. విశాఖలోని కంచరపాలెంకు చెందిన జి.ఉదయ్ కుమార్ అలియాస్ కిరణ్, మిత్రుడు ధనంజయలు కలిసి శనివారం అరకు వెళ్లి ఆదివారం తిరిగి బయలుదేరారు. రాత్రి ఒంటి గంట సమయంలో శృంగవరపుకోట సిరికి రిస్సార్ట్స్ కూడలి వద్ద కుక్క అడ్డంగా రావడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పింది. దీంతో కిందపడడంతో ఉదయ్‌కుమార్ అక్కడక్కడే మృతి చెందాడు. ధనంజయకు తీవ్రగాయాలు కావడంతో విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. ఉదయ్‌కుమార్ మేనల్లుడు సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ గంగరాజు కేసు నమోదుచేశారు.

చెరువులో దిగి బీహార్ వాసి..

రేగిడి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఉంగారాడమెట్ట వెంకట శ్రీనివాస్ ఆయిల్ మిల్లులో దినసరి కార్మికుడిగా పనిచేస్తున్న కమలేష్‌సింగ్(26) కర్మాగార సమీపం ఉన్న గుళ్లపాడు సీతసాగరం చెరువులో పడి మృతిచెందాడు. పోలీస్‌లు, స్థానికుల కథనం మేరకు.. బీహార్‌కు చెందిన 30 మంది దినసరి కార్మికులు ఏటా కార్మాగారంలో పనులకు వస్తుంటారు. ఈ ఏడాది 20 రోజుల కిందట బీహార్ నుంచి వలసకార్మికులు వచ్చారు. కాగా ఆదివారం సెలవుకావడంతో తోటి స్నేహితులతోపాటు బీహార్‌కు చెందిన కమలేష్‌సింగ్ మద్యంసేవించాడు. మద్యం మత్తులో ఉన్న ఆయన ఎవరికి చెప్పకుండా ఫ్యాక్టరీ సమీపం గుళ్లపాడు దరిలో ఉన్న సీతసాగరం చెరువు వైపునకు వచ్చి దిగిపోయాడు. మద్యం మత్తులోఉండడం, ఈతరాకపోవడం, అ సమయంలో ఎవరూ లేకపోవడంతో చెరువులో మునిగిపోయాడు. సోమవారం ఆయన మృతదేహం తేలింది. అటుగా వెళ్లినవారు కార్మాగారానికి సమచారం ఇవ్వడంతో ఆయనతో వచ్చిన బిహార్‌వాసులు అక్కడికి చేరుకున్నారు. రేగిడి ఎస్ఐ నీలవతి మృతదేహాన్ని వెలికితీసి, పంచనామపూర్తిచేసి రాజాం అసుపత్రికి పోస్టమార్టం కోసం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. కమలేష్‌సింగ్ కు ఇంకా వివాహం కాలేదు.

27 తులాల బంగారం చోరీ

సంతకవిటి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొనుగుటివలస లక్ష్మీనగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో 27 తులాల బంగారం దొంగలించారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సలాది శారద రెండురోజుల కిందట తన మూడో కుమార్తె పెళ్లి నిమిత్తం ఏలూరు వెళ్లి సోమవారం తిరిగి వచ్చేసరికి ఇంట్లో దొంగతనం జరిగింది. ఈ విషయం ఆమె స్థానికులకు తెలియజేసింది. కుటుంబ సభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన సంతకవిటి ఎస్ఐ గోపాలరావు నిందుతుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

బొబ్బిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాముడువలస జంక్షన్‌లో పక్కి గ్రామానికి చెందిన గెంబలి నరసింహమూర్తి అక్రమంగా 50 మద్యం సీసాలనుతరలిస్తుండగా సోమవారం స్వాధీనంచేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఆర్.రమేష్ తెలిపారు.వాహనాన్ని, మద్యం బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పట్టణంలోని బెస్తవీధికి చెందిన ముంత గౌరీ శంకర్ 44 మద్యం సీసాలతో పట్టుబడినట్లు హెచ్‌సీ నాగేశ్వరరావు తెలిపారు.

● విజయనగరం క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మెంటాడ మండల కేంద్రంలోని మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 16 సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నెల్లిమర్ల మండలంలోని అలుగోలు మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 45 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు నిమిత్తం గజపతినగరం, నెల్లిమర్ల ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కి అప్పగించినట్లు ఈఎస్ శ్రీనాధుడు తెలిపారు. దాడుల్లో ఈఎస్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఎస్ఐ గంగాధర్, హెచ్‌సీ శ్రీనివాసరావు, ఈసీలు దుర్గారావు, పాల్గొన్నారు.

● సంతకవిటి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):12 మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని సంతకవిటి పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సీసాలు స్వాధీనం చేసుకున్నారు. సంతకవిటి నుంచి వాసుదేవపట్నం పంచాయతీ రంగారాయిపురం మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ గోపాలరావు తెలిపారు.

కోడిపందేలు ఆడుతున్న ఎనిమిది మంది అరెస్టు

గంట్యాడ, నవంబరు (ఆంధ్రజ్యోతి) మండలంలోని బోనంగి, మదనాపురం గ్రామాల మధ్య సోమవారం సాయంత్రం జరిగిన కోడి పందేల్లో ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సాయి కృష్ణ తెలిపారు. కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఎనిమిది మందిని పట్టుకున్నారని చెప్పారు. వారి నుంచి రూ.6,890, నాలుగు కోడి పుంజలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం బోల్తాపడి ముగ్గురికి గాయాలు

రేగిడి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చరాయపురం సెంటర్ వద్ద సోమవారం ఎదురుగా వస్తున్న వాహనం తప్పించబోయి ద్విచక్రవాహనం బోల్తాపడడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది కథనం మేరకు.. సంతకవిటి మండలంలోని పొనుగుటివలసకు చెందిన టొంపుల సంత్, శాసపు అంజి, యందవప్రసాద్ ద్విచక్రవాహనంపై రాజాం నుంచి వస్తున్నారు. లచ్చరాయపురం వద్ద ఎదురుగావస్తున్న ఆటోను తప్పించబోయి బ్రేక్‌వేయడంతో బోల్తా పడింది. దీంతో స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ మీసాల ఈశ్వరరావు, పైలెట్ రవికుమార్ క్షతగాత్రులకు ప్రథమ చికిత్స నిర్వహించి రాజాం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

ఫిర్యాదులు పరిష్కరించండి: సీఐ

రామభద్రపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు కోరారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఆయన దస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు లోను కావొద్దని, గంజాయి, మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, రవాణా చేసినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పోలీసుస్టేషన్‌లో ఉన్న పెండింగ్ కేసుల గురించి ఎస్ఐ వెలమల ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు.

గంజాయి రవాణా చేస్తే వాహనాలు సీజ్‌చేస్తాం

విజయనగరం క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయి రవాణా చేసి పట్టుబడితే, ఆ వాహనాలు సీజ్ చేస్తామని ఎస్ఐ హరిబాబునాయుడు హెచ్చరించారు. విజయనగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గల ప్రదీప్ నగర్‌లోని సోమవారం సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు.

జాతీయ స్థాయి పోటీలకు గరివిడి విద్యార్థులు

గరివిడి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గరివిడికి చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు.పట్టణంలోని శ్రీవేదా జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న ఎలకల కావ్యా, జమ్ము భవాని, బూరి వంశీకుమార్, జి.తాతారావు గతనెల 26న విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సైక్లింగ్ విభాగంలో సత్తాచాటారు.ఈ మేరకు త్వరలో బీహార్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికకావడంతో అధ్యాపకులు అభినందించారు.

అంతర్ వర్సిటీ పోటీలకు రాజాం విద్యార్థులు

రాజాం, నవంబరు 4,(ఆంధ్రజ్యోతి):రాజాంలోని జీఎంఆర్ ఐటీ విద్యార్థులు పి.మణికంఠ, పి.లక్ష్మీపతిరాజులు పంజాబ్‌లోని అమృతసార్ గురునాయక్ డీఈవీ యూనివర్శిటీలో బుధవారం నుంచి జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికయ్యారని పీడీ బి.అరుణ్‌కుమార్ ఒకప్రకటనలో తెలిపారు ఇటీవల విజయనగరం ఎంవీజీఆర్ కళాశాలలో ఎంపికపోటీలు జరిగినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులను కళాశాల సిబ్బంది అభినందించారు

సురక్షితమైన తాగు నీరందించాలి

రాజాం, నవంబరు 4,(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామినాయుడు వలస గ్రామస్థులకు సురక్షితమైన తాగునీరు అందించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం గ్రామంలో మంచినీటి బోర్లు, బావుల నుంచి తాగునీటిని శాంపిల్‌గా సేకరించి సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బంది సమక్షంలో నీటిపరీక్షలు చేశారు. అనంతరం ఎంపీడీవో కంచరాం చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించారు.రాజీయ్యపేట సచివాలయాన్ని సందర్శించి ప్రజలు నుంచి వచ్చిన వినతులను అడిగి తెలుసుకున్నారు.



అర్ధాంతరంగా నిలిచిపోయిన సచివాలయ భవన నిర్మాణం

బిల్లులు చెల్లించక.. పనులు పూర్తికాక

● రైతు సేవా కేంద్రంలో సిబ్బంది విధుల నిర్వహణ ● ఇదీ కారాడ సచివాలయం పరిస్థితి

బొబ్బిలి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కారాడ గ్రామ సచివాలయ భవన నిర్మాణం బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిపోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో 40 లక్షల రూపాయలతో మూడేళ్ల కిందట భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆది నుంచి ఈ పనులు నత్తనడకన సాగాయి. కాగా ఆరు నెలల నుంచి పనులను కాంట్రాక్టర్ నిలిపివేశాడు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం గ్రామ సచివాలయ సిబ్బంది పక్కనే ఉన్న రైతు సేవా కేంద్రంలో తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించామని, అయినా పనులు పూర్తి చేయలేదని పీఆర్ డీఈఈ సీహెచ్‌వీ అప్పారావు తెలిపారు.

నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యం సేకరణ

3.40 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం: జేసీ సేతు మాధవన్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు లోబడి ఈనెల మూడోవారం నుంచి ధాన్యం రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరించనున్నట్లు జేసీ సేతుమాధవన్ తెలిపారు. సోమవారం విజయనగరంలోని ఆనందగజపతి ఆడిటోరియంలో ధాన్యం సేకరణపై సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-కేవైసీ పూర్తయిన, ధాన్యం విక్రయించేందుకు సిద్ధమైన రైతుల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. కళ్లంలో ధాన్యాన్ని సంచుల్లో నింపడం తూకం వేయడం, సంచులు కుట్టడం, వాటిని వాహనంలోకి లోడ్ చేయడానికి అయ్యే ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఈనెల 15 తర్వాత వరికోతలు మొదలయ్యే అవకాశముందని తెలిపారు. రైతు సేవా కేంద్రాలు ద్వారా సేకరించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఈ ఏడాది 3.40 లక్షలు మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించనట్లు తెలిపారు. సమావేశంలోని సివిల్ సప్లయ్ డీఎం మీనా కుమారి, వ్యవసాయ శాఖ జేడీ రామారావు, డీసీవో రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

● రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనాయుడు

రాజాం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తీవ్ర వర్షాభావం వల్ల ఈ ఏడాది నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మీనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం రాజాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మడ్డువలస ప్రాజెక్టు నుంచి సంతకవిటి మండలంలో ఆరు వేలు ఎకరాలకు నీరందక పంటలు పూర్తిగా పాడయ్యాయని తెలిపారు. ఎన్యూమరేషన్ చేసి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

●రామభద్రపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వర్షాలు కురవకపోవడంతో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా రైతు సంక్షేమ సంఘంఅధ్యక్షుడు వేమురెడ్డి లక్ష్మంనాయుడు ఒకప్రకటనలో డిమాండ్ చేశారు. మూడు నెలలుగా వర్షాలు పడకపోవడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

పాడి రైతుల నుంచి రూ.కోట్లలో దోపిడీ

శృంగవరపుకోట నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల నుంచి రూ.కోట్లల్లో దోచుకుంటున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ ఆరోపించారు. సోమవారం శృంగవరపుకోటలో పాడి రైతులు, వివిద రాజకీయ పార్టీలతో ఏపీ పాల రైతు సంఘం రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలను సేకరిస్తున్న విశాఖ డెయిరీ ధరలను తగ్గించి రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.రాంబాబు, పాలరైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లోకవరపు ఆదినారాయణ, గొంప కృష్ణ మూర్తి, చల్లా జగన్, మద్దిల రమణ పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో నగదు జమచేయాలి

శృంగవరపుకోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో వేస్తామన్న నగదు రైతుల ఖాతాల్లో జమకాలేదని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డేగల అప్పలరాజు కోరారు.ఈ మేరకు సోమవారం శృంగవరపుకోట పంచాయితీ కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం ఆందోళన నాయకులు నిరసన తెలిపారు. అన్నదాత సుఖీభవ పేరుతో వేస్తామన్న నగదు రైతుల ఖాతాల్లో జమకాలేదని ఆరోపించారు. అనంతరం కార్యనిర్వాహక కార్యదర్శి అనురాధకు వినతి పత్రం అందించారు. కార్య క్రమంలో రైతు సంఘ సభ్యులు కొట్టాను సూర్యం, మెపాడ రమణ, ఎస్.శ్రీను, కృష్ణ పాల్గొన్నారు.

విజయనగరంలో వీఆర్ఏల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వీఆర్ఏలు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామరెవెన్యూ సహాయకులకు రాత్రి పూట నైట్ వాచ్‌మన్ డ్యూటీలు ఇసుక రీచ్ వద్ద చేయాలని జారీచేసిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం నాయకులు సూర్యనారాయణ కోరారు. సోమవారం విజయనగరం కలెక్టరేట్ వద్ద సమస్యలు పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సమస్యలు గత ప్రభుత్వం హయంలో జగన్మోహన్ రెడ్డికి దృష్టికి తీసుకుని వెళ్లినా పరిష్కారం కాలేదన్నారు.కార్యక్రమంలోని సంఘ నాయకులు గురుమూర్తి, వెంకన్న పాల్గొన్నారు.

ఓటరు నమోదు వేగవంతం చేయాలి

రామభద్రపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లా ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు వేగవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు కోరారు. రామభద్రపురంలో ఉన్నత పాఠశాలలను సందర్శించి అర్హతగల ఓటర్ల నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను పాటించాలి

దత్తిరాజేరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంపీడీవో వైవీ రాజేంద్రప్రసాద్ కోరారు. సోమవారం దత్తిరాజేరులో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో శాసన మండలి ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను పాటించాలని సూచించారు.

స్థానిక ప్రజాప్రతినిధులతో వైసీపీ సమావేశం

బొబ్బిలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సోమవారం పార్టీ కార్యాలయంలో బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో గల నాలుగుమండలాల స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలను మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు తెలియజేశారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, శంబంగి వేణుగోపాలనాయుడు, తూముల భాస్కరరావ పాల్గొన్నారు.

● బొండపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గొట్లాంలో వైసీపీ మండలాధ్యక్షుడు బొద్దల చిన్నానాయుడు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహంపై వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, బొండపల్లి ఎంపీపీ చల్లా చలంనాయుడు, జడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలి

విజయనగరం టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని కొత్త అగ్రహారం మూడోవీధిలో నిర్మిస్తున్న పాఠశాల భవనం సమీపంలో కొంతమంది ఆకతా యిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో వారిపై చర్యలు తీసుకోవా లని టీడీపీ పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి గొల్లకోటి శివప్రసాద్ కోరారు. ఈమేరకు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

స్థానిక సంస్థల ఓటరు జాబితా వెల్లడి

బొబ్బిలి నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):స్థానిక సంస్థల శాసనమండలి స్థానానికి ఈనెల 28న ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో బొబ్బిలి మునిసిపాలిటీలో గల స్థానిక సంస్థల ప్రతినిధుల ఓటర్ల వివరాల జాబితాను వెల్లడించారు. మునిసిపల్ కార్యాలయంలో సోమవారం కమిషనరు లాలం రామలక్ష్మి జాబితాను నోటీసు బోర్డులో ఏర్పాటు చేశారు. మునిసిపాలిటీ పరిధిలో చైర్మన్‌తో కలిపి 31 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీటిలో 24వ వార్డుకు చెందిన కౌన్సిలరు మరిశర్ల రామారావు నాయుడు కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీ అయింది. ఆ స్థానానికి ఇంకా ఉప ఎన్నిక జరగకపోవడంతో ప్రస్తుతం 30 మంది మాత్రమే ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లుగా పరిగణింపబడతారు. 30 మందిలో తొమ్మిది మంది తెలుగుదేశం పార్టీకి చెందిన వారు కాగా మిగిలిన వారు వైసీపీకి చెందిన కౌన్సిలర్లు ఉన్నారు.

ట్రిపుల్ జంప్‌లో సత్తాచాటిన సమిత

సీతంపేట రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సీతంపేట ఆశ్రమ పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థిని సవర సమిత ట్రిపుల్ జంప్‌లో సత్తాచాటింది. అండర్-17 ట్రిపుల్ జంప్ విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికయ్యింది. ఈసందర్భంగా ఆమె సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డిని కలిసింది. ఆయన సమితకు సర్టిఫికేట్‌తో పాటు మెడల్‌ను బహూకరించారు. పీవోని కలిసిన వారిలో పాఠశాల హెచ్‌ఎం టి.వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యూవో పి.అమల, పీడీ బి.శైలజ, పీఈటీ ఎస్.ప్రమీల ఉన్నారు.

బడిదేవర కొండ రక్షణ కోసం పాదయాత్ర

బెలగాం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బడిదేవర కొండను రక్షించుకోవడానికి ఈనెల 6న పాదయాత్ర చేపడుతున్నట్లు కొండ రక్షణ కమిటీ నాయకులు తెలిపారు. సోమవారం సుందరయ్య భవనంలో సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా బడిదేవర కొండపై తవ్వకాలు చేపట్టడం అన్యాయమన్నారు. బడిదేవర కొండపై మైనింగ్ అనుమతులు రద్దుచేసే వరకు పోరాడతామని, దానిలో భాగంగా ఈనెల 6న పాత బస్టాండ్ నుంచి ఎమ్మార్ నగర్ మీదుగా, కె.ములగ వరకు పాదయాత్ర చేపడుతున్నామని తెలిపారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొండ రక్షణ కమిటీ నాయకులు నాయకులు ఎం.కృష్ణమూర్తి, కె.మన్మథరావు, రంజిత్, ఆర్వీఎస్ కుమార్, పి.సంగం, బంటు దాసు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 10 వినతులు

సీతంపేట రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గిరిజనుల నుంచి 10 వినతులు వచ్చాయి. డిప్యూటీ డీఈవో నారాయడు, పీహెచ్‌వో గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కొండపోడు పట్టా ఇప్పించాలని సవర బాలెమ్మ కోరారు. జన్నోడుగూడ గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ఎస్.మోహనరావు కోరారు. రేషన్‌కార్డు, వితంతు పింఛన్ మంజూరు చేయాలని పెద్ద గదబవలసకు చెందిన ఎస్.కన్నమ్మ విన్నవించారు. ఐటీడీఏలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో టీడబ్ల్యూ ఈఈ ఎస్.సింహాచలం పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పశువులకు మిశ్రమ దాణాతో మేలు

పార్వతీపురం రూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు తమ పశువులు తినే ఆహారంలో మిశ్రమ దాణా వాడడం వల్ల ఖనిజ లవణాలతో పాటు విటమిన్లు తగిన మోతాదులో దాణా రూపంలో అందుతాయని జిల్లా పశు సంవర్థక అధికారి డా.శివ్వాల మన్మథరావు తెలిపారు. జిల్లాకు 125 మె ట్రిక్ టన్నుల సంపూర్ణ మిశ్రమ దాణాను కేటాయించగా పార్వతీపురం మండలానికి 23 టన్నుల మిశ్రమ దాణా వచ్చింది. సోమవారం వెంకంపేటలో సబ్సిడీపై పాడి రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి ఆర్.రమేష్, కె.ప్రసాద్, బి.చక్రధర్ పాల్గొన్నారు.

గణిత మేధావి శకుంతలాదేవికి నివాళి

వేపాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సోంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు ఆతవ రవిశంకర్, రమేష్ నాయుడు ఆధ్వర్యంలో గణిత మేధావి శకుంతలదేవి జయంతి నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణితంలో శకుంతలాదేవి చేసిన సేవలను కొనియాడారు. కార్య క్రమంలో హెచ్‌ఎం బీపీఏ రాజు పాల్గొన్నారు.

లక్ష్యాలు శతశాతం చేరుకోవాలి: ఏఎంవో

రేగిడి, నవంబరు 4, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సంబంధించి అన్నిఅంశాల్లో నిర్దేశిత వ్యవధిలో శతశాతం లక్ష్యాలుచేరుకోవాలని జిల్లా అకడమిక్ మోనటరింగ్ అధికారి(ఏఎంవో) ప్రసాద్‌రావు, సీఎంవో ఆదినారాయణ కోరారు. సోమవారం రేగిడి ఎంఈవో కార్యాలయాన్ని పరిశీలించారు.

జీడి పంటకు బీమా సౌకర్యం

చీపురుపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి):జీడి రైతులు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం కల్పించిన బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన అధికారి సీహెచ్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ ప్రతికూల పరిస్థితుల వల్ల ఏటా జీడి దిగుబడి తగ్గుతోందని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద జీడి పంటకు ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఈ సౌకర్యాన్ని వర్తింపజేసినట్లు తెలిపారు.

●రామభద్రపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో భాగంగా జీడిపంటలకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించిందని ఉద్యానవనశాఖాధికారి పి.మోహన్‌కృష్ణ తెలిపారు. మండలంలోని ఆరికతోటలో రైతులకు అవగాహన కార్య క్రమం నిర్వహించారు.

అవయవ దానం చేసి.. ఆదర్శంగా నిలిచి..

● వ్యవసాయ కూలీ బ్రెయిన్‌డెడ్ ● ముందుకొచ్చిన కుటుంబ సభ్యులు

పాలకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న ఓ కూలీ బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యాడు. కోమాలోకి వెళ్లిన ఆయన తిరిగి కోలుకోవడం కష్టమని వైద్యులు నిర్ధారించారు. వైద్యుల సూచన మేరకు అవయవదానానికి అంగీకరించి, పలువురికి ఆదర్శంగా నిలిచారు ఆ కూలీ కుటుంబ సభ్యులు. గొట్ట మంగళాపురం గ్రామానికి చెందిన మడపల పెంటయ్య(42) ఈనెల 1వ తేదీన రహదారిపై నడుచుకుంటూ కింద పడడంతో కోమాలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు వెంటనే పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ ఆయనకు బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు గుర్తించారు. మెరుగైన చికిత్స కోసం రాగోలులోని జెమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యులు వివిధ రకాల తనిఖీలు చేసి పెంటయ్య కోలుకోవడం కష్టమని భార్య వసుధతో పాటు కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆశా కార్యకర్తగా చేస్తున్న భార్య వసుధ, బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న పెద్ద కుమార్తె పద్మ, వెటర్నరీ చేస్తున్న మరో కుమార్తె పావనీతో జెమ్స్ వైద్యులు సంప్రదించారు. అవయవదానంపై అవగాహన కల్పించారు. కుటుంబ సభ్యులు అంగీకరించడంతో సోమవారం పెంటయ్య అవయవాలను వైద్యులు సేకరించారు. అనంతరం పెంటయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. మృతదేహాన్ని గొట్ట మంగళాపురం తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపారు. కుమార్తెలు పద్మ, పావని తండ్రి పాడిని మోశారు.



పెంటయ్య కుటుంబసభ్యులకు అవయవదానం సర్టిఫికెట్ అందజేస్తున్న ఆస్పత్రి సిబ్బంది(ఇన్‌సెట్‌లో) పెంటయ్య (ఫైల్)

న్యూస్ బాక్స్

నేడు వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

రాజాం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని జీసీఎస్ఆర్ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్శిటీ పరిధిలో అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు మంగళవారం జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తమరావు, రవీంద్రలు తెలిపారు. యూనివర్శిటీ పరిధిలో గల అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు తమ సర్టిఫికెట్లు తీసుకొని పోటీల్లో పాల్గొనాలని పీడీ చీకటి కేశవనారాయణ పేర్కొన్నారు.

నేడు జాబ్‌మేళా

పాలకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం 9 గంటలకు కళాశాల జవహ ర్ నాలెడ్జ్ కేంద్రం ఆధ్వర్యంలో అంజనా ఫౌండేషన్ సహకారంతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ .శ్యాంబాబు తెలిపారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు ధ్రువపత్రాలతో హాజరుకావాల సూచించారు.

రేపటి నుంచి ఆంధ్రా- ఉత్తరాఖండ్ రంజీ మ్యాచ్

విజయనగరం టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విజయనగరం సమీపంలో గల చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రికెట్ మైదానంలో ఆంధ్ర, ఉత్తరాఖండ్ జట్ల మధ్య రంజీ ట్రోఫీ మ్యాచ్ బుధవారం నుంచి నాలుగు రోజులపాటు జరగనుందని నిర్వాహకులు తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు తరుపున అంతర్జాతీయ క్రీడాకారులు కేఎస్ భరత్, హనుమ విహారి, తదితరులు ప్రాతినిధ్యం వహించనున్నారు.

రేపు అండర్-19 ఎంపికలు

విజయనగరం టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అండర్- 19 విభాగంలో టెన్నీకాయిట్, బేస్‌బాల్, బాల్ బాడ్మింటన్ ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించనున్నట్లు అండర్- 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్నీకాయిట్ పోటీలను బాడంగి ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలో, బేస్‌బాల్ పోటీలను బాడంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో, బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ఎస్.కోట జడ్పీఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బాలబాలికలకు నిర్వహించే పోటీలకు ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు అర్హులని తెలిపారు.

8 నుంచి చిత్రలేఖనం పోటీలు

రాజాం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలభవన్ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 12 వరకు సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, వ్యాసరచనపై మూడు విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు బాలభవన్ రాజాంశాఖ సూపరింటెండెంట్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న చిత్రలేఖనం, వ్యాసరచన, 11న శాస్త్రీయ సంగీతం, జానపద సంగీతం, దేశభక్తి గీతాలతో పాటు ఇన్‌స్ట్రుమెంటల్ ప్లేయింగ్, 12న భరతనాట్యం, కూచిపూడి, జానపదంలోపోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల ఆరో తేదీలోగా రాజాంలో గల బాలభవన్‌లో సంప్రదించాలని కోరారు.

పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పెంపు

విజయనగరం, కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్‌లో జరగనున్న పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు ఈనెల 18 తేదీ వరకూ అపరాదరుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించువచ్చని డీఈవో మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆధార్ నమోదుకు శిబిరాలు

బొబ్బిలి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆధార్ కార్డుల నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం మంగళవారం నుంచి ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. ఈనెల 18 వరకు శని, ఆదివారాలు మినహా 14 రోజుల పాటు ఆధార్ క్యాంపులు ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు.మంగళ, బుధవారాల్లో గోపాల రాయుడుపేట, కలవరాయి, 7, 8 తేదీల్లో పెంట, చింతాడ, 11, 12 తేదీల్లో రంగరాయపురం, పక్కి, 13, 14 తేదీల్లో ఎం.బూర్జవలస, కమ్మవలస 16, 18 తేదీల్లో కాసిందొరవలస, అలజంగిలో ఏర్పాటుచేసే శిబిరాల్లో కొత్తగా ఆధార్ కార్డు నమోదు చేసుకోవడంతో పాటు అప్‌డేట్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

●రామభద్రపురం, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యార్థులు, ప్రజలకు ఈనెల 18వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రత్నం తెలిపారు. 15 రోజులు ఒక్కో గ్రామంలో సిబ్బంది ఆధార్‌లో సమస్యలు పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

కాలువలు శుభ్రపరచాలి

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ఎల్ఐసీ బిల్డింగ్ ఎదురుగా గల ప్రధాన కాలువను శుభ్రపరచాలని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదేశించారు.సోమవారం విజయనగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు.

దోమల నివారణకు ఫాగింగ్

డివిజన్ల వారీగా దోమల నియంత్రణకు ఫాగింగ్ చర్యలను చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య తెలిపారు. సాయంత్రం ఫాగింగ్ యంత్రాలతో సిబ్బంది ప్రధానంగా కాలువలు, చెరువులు, కుంటలలో స్ప్రేయింగ్‌ను చేపడుతున్నారని పేర్కొన్నారు.

సిబ్బందిపై చర్యలు చేపట్టాలి

నగరపాలక సంస్థలోని జనన, మరణాల విభాగ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ రైట్స్ ఫోరం అధ్యక్షుడు బొంగా భానుమూర్తి డిమాండ్ చేశారు. ఆయా సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ నల్లనయ్యకు వినతిప త్రం అందజేశారు.

మురుగు నీటి శుద్ధి ప్లాంట్ వద్దు

● పారిశుధ్య మహిళా కార్మికుల ఆందోళన

బొబ్బిలి నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేయవద్దని పారిశుధ్య మహిళా కార్మికులు కోరారు. సోమవారం స్థానిక పాకీ వీధిలోని పారిశుధ్య కార్మికుల కాలనీ ప్రాంతంలో మురుగునీటి శుద్ధిప్లాంట్ నిర్మించవద్దని కార్మికులు మునిసిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం మునిసిపల్ కమిషనరు లాలం రామలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కాగా రెవెన్యూ శాఖ అధికారులు అక్కడ ప్రభుత్వ భూమిని మురుగునీటి శుద్ధి ప్లాంట్ కోసం కేటాయించారని కమిషనరు లాలం రామలక్ష్మి తెలిపారు. స్థానికుల ఆందోళనను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే బేబీనాయన అధికారులతో చర్చించారని చెప్పారు. కొంత స్థలాన్ని కార్మికుల కోసం గ్రూపుహౌస్‌లను నిర్మించాలని, మిగిలిన స్థలాన్ని ప్లాంట్ ఏర్పాటుకు కేటాలయించాలని ఆదేశించారని తెలిపారు. మునిసిపాలిటీకి పారిశుధ్య కార్మికుల సంక్షేమం కూడా అవసరంకావడంతో ఆ ఇళ్ల నిర్మాణానికి సత్వరం చర్యలు తీసుకుంటామని చెప్పారు.



మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మహిళా కార్మికులు

తాగునీరెంత సురక్షితం?

(ఐదో పేజీ తరువాయి)

కార్యదర్శులు ముఖం చాటేసేవారు. దీంతో ఈ మూడు శాఖల మధ్య సమన్వయం లోపించింది.

పంచాయతీలను బలోపేతం చేస్తున్న కూటమి ప్రభుత్వం

జూన్‌లో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పంచాయతీలను బలోపేతం చేసేందుకు 15వ ఆర్థిక సంఘం నుంచి జిల్లాలోని 27 మండలాలకు చెందిన 773 పంచాయతీలకు రూ.30,74,23,956 నిధులను రెండు నెలల క్రితం అందించింది. వీటిలో రూ.18,44,54,477 టైడ్ నిధులతో 50శాతం పారిశుధ్య నిర్వహణకు, మరో 50శాతం రక్షిత నీటి సరఫరాకు ఖర్చుచేసేలా అవకాశం కల్పించింది. మిగిలిన రూ.12,29,69,479 అన్‌టైడ్ నిధులతో వీధిదీపాల నిర్వహణ, ఇతర అభివృద్ధి పనులకు వాడుకోనేలా నిర్దేశించింది. ఈ నిధులతో పంచాయతీలను పరిపుష్టి చేసే ప్రయత్నం జరుగుతోంది. ఇంతలో తుఫాన్ వర్షాలు, గత ప్రభుత్వ తప్పిదం వల్ల బయటకు వస్తున్న కలుషిత భూగర్భజలాలతో ప్రజారోగ్యానికి ముప్పు వచ్చింది.

హామీ ఇచ్చి.. విస్మరించి

(ఐదో పేజీ తరువాయి)

ఫీజులను చెల్లించాల్సి ఉంటుంది. అధికారంలోకి వచ్చిన వైసీపీ 2019లో తొలి ఏడాది మాత్రం ఒకేసారి విడుదల చేశారు. ఆ తరువాత సంవత్సరంలో మూడు విడతలుగా విడుదల చేశారు. అంతే అక్కడితో ఆపేశారు. 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాల్లో మాత్రం పైసా విడుదల చేయలేదు.

అప్పులు చేస్తున్న తల్లిదండ్రులు

ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఒత్తిడి పెంచుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఆర్థికంగా ఒత్తిడికి లోనై చేసేది లేక అప్పుల బాట పట్టారు. ఐదేళ్లలో సుమారు రూ.133.20 కోట్ల బకాయిలు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. వసతి, మెస్ చార్జీలు, పుస్తకాలు తదితర అవసరాల కోసం ఏడాదికి రెండుసార్లు వసతిదీవెన డబ్బులు ఇవ్వాలి. ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, డిప్లమో వారికి రూ.15 వేలు, డిగ్రీ, పీజీ విద్యార్థులకు రూ.20 వేలు చొప్పున అందించాలి. కానీ వసతి దీవెన బకాయిలు రూ.172.04 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది.

కూటమి ప్రభుత్వమే ఆదుకోవాలి

నా కుమార్తె శిరీషా విశాఖలోని ఓ కాలేజీలో బీఫార్మసీ చదువుతోంది. అప్పట్లో వసతిదీవెన, విద్యా దీవెన పథకం వర్తిస్తుందని చెప్పారు. అందుకే ఆ కళాశాలలో చేర్పించాం. తర్వాత సంవత్సరాల్లో వర్తింపచేయలేదు. బయట అప్పులు చేసి ఫీజులు, మెస్ చార్జీలు చెల్లించాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం ఫీజుల సర్దుబాటుకు ముందుకు రావడం శుభ పరిణామం.

- పి.అనురాధ, విద్యార్థిని తల్లి, వస్త్రపురి కాలనీ

ఉపాధి పనులు సర్పంచ్‌లకే అప్పగించాలి

చీపురుపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులను తమకే అప్పగించాలని మండలంలోని సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం పంచాయతీ రాజ్ డీఈ కార్యాలయంలోని అధికారులకు సర్పంచ్‌లు మంగళగిరి సుధారాణి, మీసాల రమణ, కరిమజ్జి శ్రీనివాసరావు, జమ్ము సావిత్రమ్మ, సూర పోలరాజు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులను ప్రస్తుతం టెండర్ విధానంలో అప్పగిస్తున్నారని, ఈ విధానం సరైనది కాదన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

చీపురుపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలో అయ్యప్ప నిర్మాణం కోసం టీడీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముల్లు రమణ, గరివిడి మండలం కుమరాం సర్పంచ్ ముల్లు రమాదేవి రూ.1,00,116 విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు సోమవారం నిర్మాణ కమిటీ సభ్యులు ఎస్వీజీ శ్రీనివాసరావు, అప్పికొండఆదిబాబు, దిలీప్ కుమార్ ధనూకా, గంట్యాడ విష్ణుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇప్పిలి తిరుమల పాల్గొన్నారు.

10 వేలు దాటిన టీడీపీ సభ్యత్వ నమోదు

లక్కవరపుకోట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట నియోజకవర్గంలో ఇప్పటివరకు పది వేల మందిని టీడీపీ సభ్యత్వ నమోదు చేసినట్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరుకు 50వేల సభ్యత్వాలు పూర్తిచేసే విధంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నేతలకు, కార్యకర్తలకు కార్తీకమాస శుభాకాంక్షలు తెలిపారు.

గనుల శాఖ ఏడీగా అశోక్

విజయనగరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గనుల శాఖ రీజినల్ విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా బి.అశోక్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీగా పని చేసిన విజయలక్ష్మి శ్రీకాకుళం బదిలీపై వెళ్లారు. దీంతో అమలాపురంలో ఏడీగా విధులు నిర్వహిస్తున్న అశోక్ కుమార్‌ను విజయనగరం ఏడీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

రాజాం రూరల్, నవంబరు 4,(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని విజయనగరం రూరల్ డివిజన్ 1104 యూనియన్ అధ్యక్షుడు రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాజాంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ షిఫ్ట్ ఆపరేటర్లకు విద్యుత్ ఉద్యోగుల మాదిరిగామెడికల్, ఈపీఎఫ్ సౌకర్యాన్ని వర్తింపజేయాలని కోరారు. సమావేశంలో వంగపండు లక్ష్మణరావు, సురగల లక్ష్మణరావు, జి.దేముడు పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

డెంకాడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ అరంగి సన్యాసి నాయుడు హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల పరిధిలో గల ఐదు మద్యం షాపుల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. బెల్టు షాపులను ప్రోత్సహిస్తూ మద్యం సరఫరా చేసి మొదటిసారి దొరికితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.5లక్షల జరిమానా విధిస్తామని, రెండోసారి దొరికితే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

డీఈవోను కలిసిన ఆప్టా నాయకులు

నెల్లిమర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నూతన డీఈవో యు.మాణిక్యంనాయుడును ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్(ఆప్టా) నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అపార్ నమోదులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని, మునిసిపల్ ఉపాధ్యాయుల పదోన్నతిల్లో మెరిట్ కమ్ రోస్టర్ విధానాన్ని అమలుచేయాలని కోరారు. ఇందుకు డీఈవో సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఆప్టా జిల్లా అధ్యక్షుడు ఎస్.భాస్కరరావు, కార్యదర్శి వి.రమణ, రాష్ట్ర అధ్యక్షుడు గణపతి, రాష్ట్ర కార్యదర్శి బి.రాము తదితరులు పాల్గొన్నారు.

జీడి పంటకు బీమా చేయించుకోండి

నెల్లిమర్ల, నవంబరు 4 (ఆంధ్రజోతి): జీడిమామిడి పంటకు రైతులు బీమా చేయించుకోవాలని మండల ఉద్యానవన శాఖాధికారిణి జ్యోత్స్న రాణి సూచించారు. మండలంలోని టెక్కలి గ్రామంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో ప్రభుత్వం జీడిమామిడి పంటకు బీమా సౌకర్యం కల్పించిందని తెలిపారు. జీడి పంట సాగుచేస్తున్న రైతులు 1బీ, ఆధార్, బ్యాంకు పుస్తకం, పంట సాగుపత్రం తీసుకుని సీఎస్సీ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఈనెల 15వ తేదీలోగా వివరాలను నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఎకరాకు రూ.1500 ప్రీమియం చెల్లించాలని ఆమె సూచించారు. పంట నష్టపోతే రూ.30వేలు ఇన్సూరెన్స్ ద్వారా పరిహారం అందజేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో సర్పంచ్ నేతేటి స్వామినాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి సతీష్


సతీష్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న షర్మిల

నెల్లిమర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబానికి విధేయుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు అనుచరుడు, వైసీపీ జిల్లా కార్యదర్శి, నెల్లిమర్లకు చెందిన గంటా సత్యనారాయణ(సతీష్) ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో సోమవారం అమరావతిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ సమన్వయకర్తగా తనను నియమించారని సతీష్ ఇక్కడి విలేకర్లకు తెలిపారు. సతీష్ గతంలో పదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీలో పనిచేశారు. నెల్లిమర్లలో 2006 నుంచి 2011 వరకు వార్డు మెంబరుగా వ్యవహరించారు. ప్రస్తుతం వైసీపీ జిల్లా కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీని వదిలి పెట్టి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలవ్వాలి

భోగాపురం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎన్నికల కోడ్ పక్కాగా అమలు అయ్యేటట్లు చూడాలని తహసీల్దార్ ఎం.సురేష్ వీఆర్వోలకు సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల నియమావళిపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమాలపై రాజకీయ నాయకులకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడ కూడా రాజకీయ నాయకుల చిత్రపటాలు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ రవి, ఆర్ఐ ఇమ్రాన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ ప్రదర్శన

భోగాపురం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ ఎం.సురేష్ సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ప్రదర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంతో కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్లు అందజేయాలని నోటీస్‌లో పేర్కొన్నారు. ● నెల్లిమర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెలలో జరుగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక నగర పంచాయతీ కార్యాలయ నోటీసు బోర్డులో నోటిఫికేషన్‌ను అతికించినట్టు నగర పంచాయతీ కమిషనర్ కె.అప్పలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బోధన బలోపేతం చేయండి

వంగర నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యాబోధన బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని సమగ్ర శిక్ష సీఎంవో ఆదినారాయణ చెప్పారు. సోమవారం వంగర జడ్పీ పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యావ్యవస్థలో వచ్చిన మార్పులకు అనుగుణంగా బోధించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణమ్మ, రామారావు, సూర్యారావు, జగదీశ్వరి పాల్గొన్నారు.

● బొబ్బిలి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలజంగి సీబీఎం పాఠశాలను సోమవారం ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావు తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన స్థాయి, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇప్పించాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో చేర్పించే ముందు విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇప్పించాలని ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు ఈశ్వర్ తెలిపారు. సోమవారం విజయనగరంలోని బీసీ వసతి గృహంలో ఈ నెల 3న విద్యార్థి శ్యామలరావు మృతి చెందడంతో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు సందర్శించారు. మృతి చెందిన బాలుడి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కోటేశ్వరరావు, ఎండీ నయీమ్ పాల్గొన్నారు.

ఇష్టానుసారం ప్రవర్తిస్తే చర్యలు



గోతులు మూయిస్తున్న ఆర్ఐ

శృంగవరపుకోట రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానంలో ఎవరైన ఇష్టానుసారం ప్రవర్తిస్తే వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ అరుణకుమారి హెచ్చరించారు. ఈనెల మూడో తేదీన ఆంధ్రజ్యోతిలో ఉచిత ఇసుకకు అడ్డంకులు శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో ఆమె స్పందించారు. సోమవారం ఆర్ఐ మనోజ్ కుమార్‌ను గోస్తనీ తీర ప్రాంతానికి పంపించి వేములాపల్లి, మామిడిపల్లి ప్రాంతాల్లో కొంత మంది అనధికారికంగా తీసిన గోతులను యంత్రాలతో కప్పించారు.

రింగ్ ట్రెంచ్‌ల నిర్మాణం వేగవంతం చేయాలి

రామభద్రపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు పంచాయతీల్లో రింగ్ ట్రెంచ్‌ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఉపాధిహామీ పథకం ఏపీవో గొలగాని త్రినాథరావు కోరారు. బూసాయవలసలో రింగ్‌ట్రెంచ్‌ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రింగ్‌ట్రెంచ్‌ల నిర్మాణాల వల్ల భూగర్భజలాలు పెంపొందుతాయని తెలిపారు.

స్కిల్ సర్వే నిర్వహించాలి

బాడంగి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్కిల్ సర్వే ఎటువంటి తప్పులు లేకుండా సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ కోరారు. సోమవారం బాడంగిలో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌పీసీఐ అకౌంట్స్‌ను యాక్టివ్‌లోకి తీసుకురావాలని కోరారు. పింఛన్ల పంపిణీ అనంతరం రిటర్న్ నగదును మూడు లేదా నాలుగో తేదీలోగా వెనుకకు జమచేయాలన్నారు.